మండుటెండ.. కుండపోత

- మండుతున్న ఎండ, అంతలోనే వాన
- విచిత్ర వాతావరణంతో ప్రజల అవస్థలు



ఆర్ట్స్ కళాశాల రోడ్డులో బుధవారం ఉదయం 9.45 గంటలకు ఎండలో ప్రయాణం



అదే రోడ్డులో ఉదయం 9.50 గంటలకు మేఘావృతమైన ఆకాశం

సీటీఆర్ఐ: ప్రస్తుతం వాతావరణం చాలా విచిత్రంగా ఉంటోంది. అసలు ఏ కాలమో తెలియని విధంగా ప్రవర్తిస్తోంది. ఉదయం నుంచే సూర్యుడు ఎండతో బెంబేలెత్తిస్తున్నాడు. వేసవి కాలం మాదిరిగా విజృంభిస్తున్నాడు. అంతలోనే వరుణుడు రంగంలోకి దిగుతున్నాడు. దాదాపు గంటసేపు వాన కురిపిస్తున్నాడు. ఆయన డ్యూటీ అయ్యాక మళ్లీ సూర్యుడు ప్రత్యక్షమవుతున్నాడు. వాతావరణంలో వచ్చిన మార్పులలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జ్వరాలు, ఒళ్లనొప్పులు, దగ్గు తదితర రోగాలతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు.

ఆహ్లాదం కరవు

ఎండకాలంలో భానుడి వేడితో అల్లాడిన ప్రజలు వర్షాకాలంలో ఆహ్లాదకర వాతావరణంతో సేదతీరుతారు. గతంలో ఎప్పుడు ఇలాగే జరిగిది. వర్షాకాలంలో ఎండ కాసినా అంత ప్రచండంగా ఉండేది కాదు. కానీ ఇప్పుడు ఒక పక్క వరుణుడు, మరోపక్క భానుడు పోటాపోటీగా ప్రజలపై తమ ప్రతాపాన్ని చూపిస్తున్నారు. ఉదయం నుంచే ఎండ రావడంతో ఉక్కపోత ఎక్కువై పోతోంది. వేసవి కాలం మాదిరిగా ఇళ్లలో ఏసీలు పనిచేయాల్సి వస్తోంది. ఇంతలోనే కుండపోతగా వర్షం కురుస్తుంది.

మార్పులకు కారణమిదేనా..

వాతావరణంలో ఇంత మార్పు రావడానికి ప్రధాన కారణం గ్లోబల్ వార్మింగ్ అని నిపుణులు చెబుతున్నారు. దాని వల్ల ఇలాంటి విచిత్ర వాతావరణం నెలకొందన్నారు. నేలపై పచ్చని చెట్లు లేకుండా నరికివేయడంతో ఈ పరిస్థితిని ప్రధాన కారణమని స్పష్టం చేశారు. గతంలో నగరాలలో చెట్లను నరికివేశారని, ఇప్పుడు ఓ మాదిరి పెద్ద గ్రామాలలో కూడా ఇదే పరిస్థితి ఏర్పడిందన్నారు. చెట్లను నరికివేయడంతో ఎండలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, దానివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరిగిపోవడం, తోటలు, పచ్చని పొలాలను నాశనం చేసి లేఅవుట్లు వేయడం, కొండలను కొట్టేయడం వల్ల గ్లోబల్ వార్మింగ్ పెరిగిపోయిందన్నారు. వారం రోజులుగా ఉష్ణోగ్రత 33 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు అవుతోంది. గాలిలో తేమ శాతం 80 శాతం నుంచి 95 శాతం వరకూ ఉంటోంది. దీంతో ఉక్కపోత బాగా ఎక్కువైంది.



వర్షంలో మోటార్ సైకిల్‌పై వెళుతున్న ప్రయాణికులు (ఫైల్)

పెరిగిన ఏసీల వినియోగం

గతంలో వేసవి కాలంలోనే ఏసీలను బాగా ఉపయోగించేవారు. మిగిలిన కాలాలలో వాటి వినియోగం ఉండేది కాదు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. కాలానికి సంబంధం లేకుండా ఏసీలు వినియోగించాల్సి వస్తోంది. ప్రస్తుతం వర్షాకాలమైనా ఏసీల వినియోగం బాగా పెరిగింది. ఎండలు బాగా పెరిగిపోవడంతో వాటి వాడకం తప్పనిసరి అయ్యింది. ఇక రోడ్ల పక్కన వ్యాపారం చేసుకున్న చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయమే ఎండ రావడంతో ఉత్సాహంగా వ్యాపారం ప్రారంభిస్తున్నారు. అంతలోనే వాన కురవడంతో ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు పక్కన వస్తువులను పేర్చి విక్రయాలు జరిపేవారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వాన కురిసినప్పుడు వాటిని సర్దుకోవడం చాలా ఇబ్బందిగా మారింది. అనుకోకుండా వర్షం కురవడంతో ప్రజలు బయటకు రావడం లేదు. దీనివల్ల వ్యాపారాలు కూడా సక్రమంగా జరగడం లేదు.

మానవ మనుగడ కష్టమే..



విచిత్ర వాతావరణం తీవ్ర ఇబ్బంది పెడుతోంది. గోదావరి చెంతనే ఉంటున్నా ఎడారిలో ఉన్న భావన కలుగుతోంది. ఇదే కొనసాగితే కొన్ని రోజులకు మానవ మనుగడకు చాలా కష్టం కలుగుతుంది. ప్రకృతికి హాని చేయకుండా మనుషులు నడుచుకుంటేనే భావితరాలకు మంచి వాతావరణం అందించగలం.

– పి.విశాలాక్షి, తెలుగు అధ్యాపకురాలు, ఎస్‌కేఆర్ డీఈడీ కళాశాల

చెట్లను నరకడమే కారణం



మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడటానికి బదులు ఆధునీకరణ పేరుతో చెట్లను ఎక్కడ పడితే అక్కడ నరికివేస్తున్నారు. ఒక మొక్క పెరిగి చెట్టులా మారడానికి అనేక ఏళ్లు పడుతుంది. వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులకు చెట్లను నరికివేయడమే ప్రధాన కారణం.

– మేడిశెట్టి సబిత, వృక్షశాస్త్రశాఖ అధ్యాపకురాలు, ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

క్లుప్తంగా

విగ్రహాల ప్రతిష్ఠాపన పూజలు ప్రారంభం



ప్రత్యేక పూజలు చేస్తున్న వేదపండితులు

కడియం: దుళ్ల గ్రామ దేవత పోలేరమ్మ ఆలయంలో పోతురాజుస్వామి, నాగమ్మల విగ్రహాల ప్రతిష్ఠాపన గురువారం ఉదయం 8.30 గంటలకు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. దీనిలో భాగంగా బుధవారం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ప్రముఖ శైవాగమ పండితులు బాదంపూడి సత్యనారాయణ శర్మ పర్యవేక్షణలో వేద పండితుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. పుణ్యదేవతావాహన, నూతన విగ్రహాలకు క్షీరాభిషేకాలు చేశారు. దాతల సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి భక్తులందరూ తరలిరావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

పరీక్ష అట్టల పంపిణీ

కడియం: మండల కేంద్రమైన కడియం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం పరీక్ష అట్టలను పంపిణీ చేశారు. రాజమహేంద్రవరానికి చెందిన డాక్టర్ పాతూరి మధు, రైజ్ ఈఎన్‌టీ హాస్పటల్స్ సహకారంతో వీటిని సమకూర్చారు. ఈ మేరకు స్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెలుగుబంటి నాని పంపిణీని ప్రారంభించారు.

ఇన్‌స్పెక్టర్ దృష్టికి మొక్కల చోరీలు



ఇన్‌స్పెక్టర్‌ను కలిసిన నర్సరీ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు తదితరులు

కడియం: మండలంలోని వివిధ గ్రామాల్లో మిర్చిమేరీ గోల్డ్ రకం మొక్కల చోరీల విషయాన్ని కడియం ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరరావుకు నర్సరీ రైతులు విన్నవించారు. సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు, ఉపాధ్యక్షులు పెనుమాక కొండబాబు, పాలకవర్గం ఆధ్వర్యంలో బుధవారం సీఐని కలిశారు. చోరీల నివారణకు రాత్రిపూట గస్తీని నిర్వహించాలని కోరారు. అలాగే పొట్టిలంక – కడియపులంక మధ్య జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు.

వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



ఇస్కాన్‌లో శ్రీలక్ష్మీనరసింహయజ్ఞం చేస్తున్న అర్చకులు

సీటీఆర్ఐ: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా గోదావరి గట్టున గల ఇస్కాన్ మందిరంలో వేడుకలు కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమాలు ఈ నెల 19వ తేదీన ప్రారంభమైన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా బుధవారం శ్రీలక్ష్మి నరసింహ యజ్ఞం, సూర్యప్రభ వాహన సేవ జరిపారు. ప్రతి రోజూ శ్రీకృష్ణ లీలలపై ప్రసంగం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వీటిని ఇస్కాన్ రాజమహేంద్రవరం శాఖ కమిటీ చైర్మన్ శివానంద నిమాయదాస్, శ్యామాంగ నిమాయదాస్, హేమంగా నిమాయదాస్ తదితరులు పర్యవేక్షణ చేస్తున్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: మరమ్మతుల నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాలలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 7 నుంచి 11 గంటల వరకూ లలితా నగర్, హరిపురం, వీరభద్రపురం ఏరియాలలో విద్యుత్ ఉండదు.

- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ బత్తిన నగర్, ఆల్వాల్ నగర్, ఇండస్ట్రియల్ ఏరియా, స్వరూప్ నగర్, సాయిదుర్గా నగర్, నారాయణపురం, సైక్లోన్ కాలనీ, గాదిరెడ్డి నగర్ ప్రాంతాలలో అంతరాయం కలుగుతుంది.

నేడు పరిష్కార వేదిక

రాజమహేంద్రవరం రూరల్: సీజీఆర్ఎఫ్, ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో గురువారం రాజమహేంద్రవరం మల్లయ్యపేట పేపరుమిల్లు క్వార్టర్స్ ఆవరణలోని రూరల్ సబ్ డివిజన్ కార్యాలయం వద్ద విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నారు. వినియోగదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలను పరిష్కారం పొందాలని సీజీఆర్ఎఫ్ కార్యదర్శి కోరారు. ఈ కార్యక్రమానికి సీజీఆర్ఎఫ్ చైర్ పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు వి.జనార్దనరావు, స్వతంత్ర సభ్యులు డాక్టర్ రాయసం సురేంద్ర కుమార్ హాజరవుతారన్నారు.

ధరల నియంత్రణ కమిటీ సభ్యుడిగా అనంతరావు



రాజమహేంద్రవరం సిటీ: జిల్లా ధరల నియంత్రణ కమిటీ సభ్యుడిగా న్యాయవాది గొట్టిముక్కల అనంతరావు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ పి.ప్రశాంతి ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న ఈ కమిటీలో జిల్లాలోని వివిధ శాఖల అధికారులు సభ్యులుగా వ్యవహరిస్తారు. ప్రతి నెలా కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశమై ధరల నియంత్రణపై తీసుకున్న చర్యలను పర్యవేక్షిస్తారు. ఈ సందర్భంగా అనంతరావు మాట్లాడుతూ నిత్యావసరాలను అధిక ధరలకు అమ్మితే చర్యలు చేపడతామన్నారు.

అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు

కంబాలచెరువు: రాజమహేంద్రవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024 – 25 విద్యా సంవత్సరానికి రెండు అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎస్ఎస్ఎల్‌వీ నరసింహం తెలిపారు. సంస్కృతం, సివిక్స్‌లను బోధించడానికి ఆయా సబ్జెక్టుల్లో 50 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి గంటకు రూ.150 చొప్పున నెలకు రూ.10 వేలు గౌరవ వేతనం ఉంటుందన్నారు. ఆసక్తి, అర్హత కలవారు శుక్రవారం సాయంత్రం 4 గంటల్లోపు కళాశాల కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని, 24వ తేదీ ఉదయం 10 గంటల నుంచి కళాశాలలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు.

సర్వమానవాళి సేవే మానవత లక్ష్యం



ర్యాలీ చేస్తున్న మానవత సేవా సంస్థ సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: సమాజంలో చక్కటి విలువలను నెలకొల్పి, కులమతాలకు అతీతంగా సర్వమానవాళికి సేవలు అందించే లక్ష్యంతో మానవత పనిచేస్తోందని ఆ సేవా సంస్థ రాజమహేంద్రవరం శాఖ అధ్యక్షుడు పాల కృష్ణప్రసాద్‌రెడ్డి అన్నారు. మానవత ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న శాంతి ర్యాలీ వారోత్సవాలలో భాగంగా బుధవారం నగరంలో సిటీ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం రామారావు, మానవత కన్వీనర్ బీఎస్ఎన్ మూర్తి, పూర్వ అధ్యక్షుడు బూరగడ్డ మురళి, కార్యనిర్వాహక సభ్యులు సాయిబాబా, శ్రీరామ్మూర్తి, విజయ కిరణ్, పి.అప్పారావు, బొదిరెడ్ల అప్పారావు, కొమ్మ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రియదర్శిని విద్యార్థులకు మందుల వితరణ



విద్యార్థులకు మందులు పంపిణీ చేస్తున్న పీఎంపీ అసోసియేషన్ నాయకులు

కంబాలచెరువు: స్థానిక మున్సిపల్ కాలనీలోని ప్రియదర్శిని ఆశ్రమంలో విద్యార్థులకు కమ్యూనిటీ పారామెడిక్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్) ఆధ్వర్యంలో బుధవారం సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులు పంపిణీ చేశారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చన్నారు. ఆశ్రమ నిర్వాహకులు స్వప్నవర్మ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ఆశ్రమంలో పిల్లలకు మందులు పంపిణీ చేసిన పీఎంపీ అసోసియేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు, కార్యదర్శి పి.దేవానందం, రాజమహేంద్రవరం అధ్యక్షుడు రహమాన్ ఖాన్, కార్యదర్శి మట్టా రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ వృద్ధుల దినోత్సవం



వృద్ధులకు దుస్తులు అందజేస్తున్న గుబ్బల రాంబాబు

రాజమహేంద్రవరం సిటీ: సమాజంలో వృద్ధులు నిరాదరణకు గురవుతున్నారని, వారిని సంరక్షించడాన్ని కుటుంబ సభ్యులతో పాటు సమాజం కూడా బాధ్యతగా తీసుకోవాలని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ వ్యవస్థాపకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు అన్నారు. లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో బుధవారం జాతీయ వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి దుస్తుల పంపిణీ చేశారు. రాంబాబు మాట్లాడుతూ 26 ఏళ్లుగా స్వర్ణాంధ్ర సేవా సంస్థ వృద్ధులు, ఒంటరి జీవులు, నిరాశ్రయులను చేరదీసి వారికి సకల సౌకర్యాలు కల్పిస్తూ, గౌరవప్రదమైన జీవితాన్ని అందించడానికి కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో స్వర్ణాంధ్ర కార్యదర్శి గంగాధర్, హరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు హార్లిక్స్ ఫ్యాక్టరీ ఎన్నికలు

- ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకూ పోలింగ్
- రాత్రికి ఫలితాల వెల్లడి

ధవళేశ్వరం: హార్లిక్స్ ఫ్యాక్టరీ గుర్తింపు యూనియన్ ఎన్నికలు గురువారం జరగనున్నాయి. ఫ్యాక్టరీ ఆవరణలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. అనంతరం ఓట్లను లెక్కించి రాత్రికి ఫలితాలను ప్రకటిస్తారు. మారిన సమీకరణాల నేపథ్యంలో ఐదు యూనియన్లు కూటమిగా ఏర్పడి గోదావరి జీఎస్‌కే వర్కర్స్ యూనియన్ విమానం గుర్తుపై పోటీ చేస్తోంది. ఈ కూటమిలో హెచ్ఎంఎం లిమిటెడ్ హార్లిక్స్ వర్కర్స్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ), జీఎస్‌కే హార్లిక్స్ వర్కర్స్ యూనియన్, తెలుగునాడు వర్కర్స్ యూనియన్, చైతన్య హార్లిక్స్ వర్కర్స్ యూనియన్ ఉన్నాయి. కూటమిగా ఏర్పడటంతో తమ గెలుపు నల్లేరుమీద నడకేనని విమానం గుర్తుపై పోటీ చేస్తున్న గోదావరి జీఎస్‌కే వర్కర్స్ యూనియన్ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరో పక్క కాగడా గుర్తుపై పోటీ చేస్తున్న ఎస్‌బీసీబీ లిమిటెడ్ (హార్లిక్స్)ఆపరేటర్స్, వర్కర్స్ యూనియన్ నాయకులు మెజారిటీ ఓటర్లు తమ వైపే ఉన్నారంటున్నారు. మొత్తం 974 మంది కార్మికులకు ఓటు హక్కు ఉండగా వీరిలో ఇద్దరు ఇటీవల మృతి చెందారు. దీంతో 972 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ధవళేశ్వరం సీఐ టి.గణేష్ ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. డీఎస్పీ, ముగ్గురు సీఐలు, ఆరుగురు ఎస్సైలు , పది మంది ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, 30 మంది కానిస్టేబుళ్లు బందోబస్తు నిర్వహించనున్నారు.



ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించి సూచనలు ఇస్తున్న ధవళేశ్వరం సీఐ గణేష్

ముంపునకు గురైన వరిచేల పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాస్

రాజమహేంద్రవరం రూరల్: ముంపునకు గురైన వరి చేను ఎరుపు రంగులోకి మారుతుందని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఆయన బుధవారం తొర్రేడు, వెంకటనగరం, కాతేరు గ్రామాల్లో ముంపునకు గురైన వరిచేలును సందర్శించారు. డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ పొటాషియం లోపమే వరిచేను ఎరుపు రంగులోకి మారడానికి కారణమన్నారు. దీని నుంచి పంట త్వరగా కోలుకోవడానికి మల్టీకే పది గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ప్రస్తుతం ఉక్కపోత వాతావరణం కారణంగా పాముపొడ తెగులు సోకకుండా షీత్‌మార్ రెండు గ్రాముల చొప్పున లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి భీమరాజు, ఏఈఓ జాన్ పీటర్, వీఏఏలు, రైతులు ఉన్నారు.

ఐఎన్‌టీయూసీ బలోపేతానికి అడుగులు



సమావేశంలో మాట్లాడుతున్న గిడుగు రుద్రరాజు

రాజమహేంద్రవరం సిటీ: ఐఎన్‌టీయూసీ కాంగ్రెస్ పార్టీలో ఒక భాగమని, కార్మికులకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కాంగ్రెస్ సీడబ్ల్యూసీ సభ్యులు, పీసీసీ మాజీ చీఫ్ గిడుగు రుద్రరాజు అన్నారు.క్వారీ సెంటర్‌లోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. అనంతరం ఐఎన్‌టీయూసీ సిటీ అధ్యక్షుడిగా రామకృష్ణ, కార్యదర్శిగా రాజు, ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిటీ ఇన్‌చార్జి బోడా వెంకట్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్తూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దారి దోపిడీ ముఠా అరెస్ట్

దేవరపల్లి: జాతీయ రహదారిపై దారి కాసి వాహనదారులను బెదిరించి సొమ్ములు వసూలు చేస్తున్న ముఠాను స్థానిక పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. స్థానిక ఎస్సై వి.సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజమహేంద్రవరం సమీపంలోని బొమ్మూరు రాఘవేంద్ర కాలనీకి చెందిన సిర్రా జాస్పర్ ప్రిన్స్, అక్కడకు సమీపంలోని సత్యనారాయణ నగర్‌కు చెందిన గెల్లా సజని, హుకుంపేటలోని రామకృష్ణనగర్‌కు చెందిన గెల్లా వినేష్ చార్లెస్, వేమగిరి గ్రావణ్య, రాజమహేంద్రవరానికి చెందిన సాయి, సంతోష్, చిరు కలసి ముఠాగా ఏర్పడ్డారు. వారిలో ఐదుగురు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నారు. ఈ ముఠా ఇన్నోవా కారుకు పోలీసు సైరన్ ఏర్పాటు చేసుకుంది. బుధవారం మధ్యాహ్నం గేదెలను తరలిస్తున్న ఓ వాహనాన్ని జాతీయ రహదారిపై స్థానిక డైమండ్ జంక్షన్ వద్ద ఆపి తాము పోలీసులం అని చెప్పి, వారి వద్ద నుంచి ఫోన్ పే ద్వారా రూ.15 వేలు కాజేసింది. కొద్దిసేపటికే ఈ విషయం పోలీసు ఉన్నతాధికారులకు చేరింది. వారి ఆదేశాల మేరకు దేవరపల్లి సీఐ బాల సురేష్ తన సిబ్బందితో కలసి డైమండ్ జంక్షన్‌కు చేరుకున్నారు. అదే సమయానికి ఆ ముఠా బొలెరో వాహనంలో ఆవులను తరలిస్తున్న వారిని ఆపి రూ.25 వేలు కాజేసే ప్రయత్నం చేయసాగింది. ఆవులను తరలిస్తున్న వారి వద్ద నుంచి రూ.2 వేల నగదు తీసుకుని, మిగతా 23 వేలూ ఫోన్ చేయాలని ఈ ముఠా సభ్యులు డిమాండ్ చేయసాగారు. ఇదే సమయంలో పోలీసులు దాడి చేసి ఆ ముఠాలోని ఏడుగురినీ అరెస్టు చేశారు.

బంగారం, వెండి వస్తువుల మాయం

కంబాలచెరువు: కాతేరుకు చెందిన దాసరి వీరబాబు ఈ నెల 19న పని నిమిత్తం ఊరు వెళ్లాడు. తిరిగి 20వ తేదీ తెల్లవారుజామున ఇంటికి వచ్చి చూసేసరికీ బీరువా తెరిచి ఉంది. దానిలో బంగారం, వెండి వస్తువులు మాయమయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భారత్ బంద్ విజయవంతం



బంద్ నిర్వహిస్తున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు



కడియపులంకలో నిరసన తెలుపుతున్న యువత

రాజమహేంద్రవరం రూరల్: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో మండలంలో బుధవారం నిర్వహించిన భారత్‌బంద్ విజయవంతమైంది. సుందరపల్లి అనిల్, నక్కా విజయ్ కుమార్ ఆధ్వర్యంలో హుకుంపేట, జైహింద్ నగర్, మోరంపూడి జంక్షన్, కోనేరు పేట, సాయినగర్, బాపూజీ నగర్, వెంకటగిరి మోరంపూడి వరకూ ప్రతి కార్యాలయాన్ని, షాపులను మూయించారు. వైద్యం, మెడికల్ షాపులు, అత్యవసర సేవలకు మినహాయింపు ఇచ్చారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ వాది చీరా రాజు మాట్లాడుతూ బంద్‌కు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

కడియం: వర్గీకరణ పోరాట సమితి జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం మండలంలో బంద్ సంపూర్ణంగా జరిగింది. మండలంలోని పాఠశాలలు, బ్యాంకులు, వర్తక, వాణిజ్య సముదాయాలు మూతపడ్డాయి. వాహనాలు సైతం ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. కడియపులంక దళిత చైతన్య యూత్, దళిత నాయకులు నిరసనలో పాల్గొన్నారు. వీరవరం, దుళ్ల తదితర గ్రామాల్లో అంబేడ్కర్ యూత్ సభ్యులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు.

చోరీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

మధురపూడి: కోరుకొండ మసీదు పక్కనే గల బ్యాంకర్స్ షాపులో మార్చిలో జరిగిన చోరీకి సంబంధించి ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం సీఐ అడపా నాగమురళి ఆ వివరాలు వెల్లడించారు. నిందితులైన కోరుకొండ మండలం పశ్చిమ గానుగూడెం గ్రామానికి చెందిన బొమ్మతి సుధీర్ కుమార్, కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం నేదినూరి గ్రామం అరిపాలెం వీధికి చెందిన పులిదిండి కిరణ్ కాపవరం గ్రామశివారులో తిరుగుతుండగా అరెస్టు చేశామన్నారు. చోరీ చేసిన బంగారాన్ని వరంగల్ జిల్లా హన్మకొండ రాజుపేటలోని ముత్తూట్ ఫైనాన్స్, కెనరా బ్యాంకుల్లో నిందితులు తాకట్టుపెట్టినట్టు గుర్తించామన్నారు. వారి నుంచి 42.5 గ్రాముల బంగారం ఆభరణాలు, 450 గ్రాముల వెండి వస్తువులను రికవరీ చేసినట్టు తెలిపారు.

ఆగిన లారీని ఢీకొన్న మరో లారీ



ఘటనా స్థలంలో లారీలు

మధురపూడి: జాతీయ రహదారి 215 ఈపై కోరుకొండ మండలం జంబూపట్నం పరిధిలో అయ్యన్నగళ్ల సమీపంలో బుధవారం రోడ్డు ప్రమాదం జరిగింది. కోరుకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా నుంచి కాకినాడ వెళ్తున్న ఊక లారీని డ్రైవర్ రోడ్డ పక్కన నిలిపాడు. దానిని గోకవరం నుంచి రాజమహేంద్రవరం వైపునకు వెళుతున్న మరో లారీ వెనక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో వెనుక లారీ ముందుభాగం ధ్వంసమైంది. దానిలోని ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. ఏఎస్సై సత్యనారాయణ కేసు నమోద చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదే ప్రదేశంలో మంగళవారం ఒకరు మృతి చెందడం, బుధవారం ఈ ప్రమాదం చోటుచేసుకోవడంతో ప్రయాణికులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ ప్రమాద హెచ్చరికల బోర్డులు ఏర్పాటుచేయాలని, పోలీసు గస్తీ నిర్వహించాలని కోరుతున్నారు.

దాడి ఘటనపై కేసు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం లంకూరుకు చెందిన దూళ్ల మహాలక్ష్మిపై దాడి చేసిన మాగాపు దుర్గాప్రసాద్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై ఎ.ఫణి మోహన్ బుధవారం తెలిపారు. ఈనెల 19న లంక భూమిలో పశువులు కాసుకుంటున్న మహాలక్ష్మి, దుర్గాప్రసాద్‌ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీనితో మహాలక్ష్మిపై కర్రతో దుర్గా ప్రసాద్ దాడి చేశాడు. దీంతో మహాలక్ష్మి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. తీవ్ర గాయాలతో గోదావరి గట్టు వద్ద పడి ఉన్న మహాలక్ష్మిని అతడి కుటుంబ సభ్యులు చూసి, వెంటనే సీతానగరంలో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం జీఎస్ఎల్‌కు తరలించారు. ఆసుపత్రి సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.